క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పీఈటీ వెంకటప్ప క్రీడా దుస్తులను అందజేశారు. 36 మందికి దుస్తులు సమకూర్చినట్లు ఆయన వివరించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



ధన్వాడ: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని టీచర్ సంతోష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పోషణ్ పక్షంలో భాగంగా చిరుధాన్యాలపై వారికి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం చిన్నారులకు ఎంతో ఉపయోగకరమని వివరించారు.

నేడు రక్తదాన శిబిరం

కోస్గి: బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కర్నె శ్రీశైలం వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు వివరాలను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీబీ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు పోకల లక్ష్మణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని సూచించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం



కోస్గి: టీడీపీకి రాష్ట్రంలో పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వెంకట్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం కోస్గి మండలంలోని కడంపల్లి, బోగారం, ముదిరెడ్డిపల్లి, హన్మాన్‌పల్లి, అమ్లికుంట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో పార్టీకి 32 లక్షల సభ్యత్వాలున్నాయన్నారు. నాయకులు రవి, మల్లేష్, వెంకటయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట టౌన్ : మండలంలోని జిలాల్‌పూర్, బైరంకొండలో 11 కేవీ ఫీడర్ మరమ్మతులో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ సాయినాథ్‌రెడ్డి శనివారం వివరాలు తెలిపారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఫైలేరియా నిర్మూలనకు చర్యలు

అమరచింత: చిన్నారులలో ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రక్త పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులకు రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నారాయణపేట రూరల్ : మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరిగాయి. విద్యార్థులే ఉపాధ్యాయులై ఒకరోజు తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించారు. చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు హాజరై ఉపాధ్యాయ పాత్ర పోషించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్, ఎంపీటీసీ బాలమణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సల్మాన్‌రాజ్, ఎస్‌ఎంసీ చైర్మన్ జయప్రకాష్, టీచర్లు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్, సంధ్య పాల్గొన్నారు.



రైతుబంధు రాలే

- మండలంలో 155 మందికి తప్పని ఎదురుచూపులు



దామరగిద్ద: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల ఖాతాల్లో ఇప్పటికీ యాసంగి సాగుకు సంబంధించిన రైతుబంధు డబ్బులు జమ కాలేదు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. సాగు పెట్టుబడికోసం అప్పులు చేయాల్సి వచ్చిందని వాపోతున్నారు. తమకు పెట్టుబడి సాయం ఎందుకు రావడం లేదో తెలియడం లేదని అంటున్నారు. అధికారులను అడిగితే ఆలస్యమైనా వస్తాయని సర్ది చెబుతూ దాటవేస్తున్నారని, సరైన కారణం ఏమిటో తెలపడం లేదని వాపోతున్నారు.

మండలంలో 155 మందికి పెండింగ్

మండలంలో చిన్న, సన్నకారు, పెద్దరైతులు అందరూ కలిసి మొత్తం 16552 మంది ఉన్నారు. సాధారణంగా వీరందరికీ కలిపి రూ. 19.93 కోట్లు రైతుబంధు అందుతుంది. కానీ యాసంగి సాగుకు సంబంధించి 16397 మంది రైతులకు రూ.18.91 కోట్లు జమ అయినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. ఇంకా 155 మంది ఖాతాల్లో డబ్బులు జమకావాల్సి ఉందని చెబుతున్నారు. అయితే మొదట చిన్న, సన్నకారు రైతులకు ఆ తరువాత పెద్ద రైతులకు డబ్బులు జమ అవుతున్నాయని, ఇంకా అందని వారిలో పెద్ద రైతులే ఎక్కువగా ఉన్నారని అంటున్నారు. త్వరలోనే జమ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా పలువురు రైతులు ఈ విషయంపై మాట్లాడుతూ మండలంలో తమ కంటే పెద్దరైతుల ఖాతాల్లోనూ డబ్బులు జమ అయినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేసి, అప్పుల పాలు కాకుండా ఆదుకోవాలని, డబ్బులు వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

ఇప్పటికీ డబ్బులు రాలేదు



వత్తుగుండ్ల గ్రామంలో మాకు 13 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనికి సంబంధించి యాసంగి సాగు రైతుబంధు డబ్బులు ఇంకా రాలేదు. అధికారులను అడిగితే 10 ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు ఇంకా జమకాలేదని అంటున్నారు. కానీ మా కంటే ఎక్కువ పొలం ఉన్న రైతులకూ డబ్బులు వచ్చినట్లు తెలుస్తోంది. డబ్బులు జమకాకపోవడంతో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

– జైపాల్‌రెడ్డి, రైతు వత్తుగుండ్ల

అందరికీ అందుతాయి

మండలంలో 155 మంది రైతులకు మినహా మిగతా అందరి ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయ్యాయి. ఇంకా డబ్బులు జమ అవ్వని వారిలో ఎక్కువగా పెద్ద రైతులే ఉన్నారు. పెండింగ్‌కు సంబంధించి టెక్నికల్‌గా ఎలాంటి కారణాలు లేవు. ఆలస్యమైనా అందరికీ డబ్బులు అందే అవకాశం ఉంది.

–అరవింద్, మండల వ్యవసాయ అధికారి, దామరగిద్ద

హెచ్‌ఎంకు మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..

నారాయణపేట రూరల్ : మండలంలోని కొల్లంపల్లి ప్రాథమిక పాఠశాలకు సంబంధించి శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'విద్యార్థులను గాలికి వదిలి చీరల కొనుగోలు' అనే వార్తా కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. డీఈఓ లియాకత్ అలీ ఆదేశాల మేరకు క్లస్టర్ హెచ్‌ఎం సల్మాన్‌రాజ్ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల నుంచి వివరణ తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు మెమో జారీ చేశారు. కాగా విషయంపై స్పందిస్తూ ఉగాది సందర్భంగా వంట మనుషులకు చీరలు ఇప్పించాలనే ఉద్దేశంతో చేనేత వ్యాపారిని స్కూల్‌కి పిలిపించామని ఉపాధ్యాయులు వివరణ ఇచ్చారు. కానీ వారి వివరణ సరికాదని గ్రామస్తులు అంటున్నారు. వాస్తవానికి ఇక్కడి చీరలు కొనుగోలు చేసి పాలమూరులో అమ్ముకోవడం చేస్తుంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ



మరికల్: నాగర్‌కర్నూల్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి శనివారం మరికల్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను వివిధ సంఘాల నాయకులు, యువక మండలి సభ్యులు, రాజకీయ నాయకులు సన్మానించారు. అదేవిధంగా ఇదివరకు మరికల్‌లో విధులు నిర్వహించి నాగర్‌కర్నూల్‌కు బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ అశోక్‌బాబునూ సన్మానించారు. కొత్తగా వచ్చిన ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా విధులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్, రాము పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ఏర్పాటు

మరికల్: మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అంబలి కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, బాటసారులకు అంబలి అందజేశారు. 20 ఏళ్ల నుంచి ఏటా అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు లక్ష్మయ్య, సతీష్, బసంత్, రవి, గోపాల్, కృష్ణయ్య, జగదీశ్, రఘు, బాలకిష్ణ, మాసప్ప, ముకుందరెడ్డి, హన్మిరెడ్డి పాల్గొన్నారు.



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అయ్యప్ప భక్తులు

పార్వతీ పరమేశ్వరుల ప్రభోత్సవం



పభోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణా: మండల పరిధిలోని చేగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, రుద్రాభిషేకం, బిల్వార్చనతో పల్లకీసేవ, నందికోలు కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అధిపతి క్షీరలింగ మహాస్వామి, ఆలయ కమిటీ సభ్యుడు రాజప్పగౌడ, సర్పంచ్ శివప్ప తాగునీరు, వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

హాస్టల్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి



మద్దూరు: మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్ పదోతరగతి విద్యార్థులకు జిల్లా బీసీ సంక్షేమాధికారి కృష్ణామాచారి పరీక్ష సామగ్రి శనివారం పంపిణీ చేశారు. పరీక్షలలో అనుసరించాల్సిన మెలకువలపై పలు సూచనలు చేశారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి సత్తా చాటాలన్నారు. వార్డెన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై వేటు సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

మక్తల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదని మక్తల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.నర్సిములు అన్నారు. శనివారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా పాలన చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. నాయకులు నారాయణ, రవికుమార్, వెంకటేష్, కల్లూర్ గోవర్ధన్, నర్సింహ, బహాదూర్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



మాగనూర్: పదో తరగతి పరీక్షలు ఈ నెల 3 నుంచి జరగనున్న నేపథ్యంలో మండలంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. శనివారం గుర్తించిన కేంద్రాలలో మండల విద్యాధికారులు ఏర్పాట్లును పరిశీలించారు. కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీటీ జైపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుధా, విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల వసతిగృహం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

ధన్వాడ: మండల కేంద్రంలో కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి చుట్టుపక్కల నుంచి దాదాపు 400 మంది వరకు విద్యార్థులు కళాశాల విద్య అభ్యసించడానికి వస్తుంటారన్నారు. వసతి గృహం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జడల బాలరాజు, చంద్రయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఇమామ్, మౌజంలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: రంజాన్ పండుగ కానుకగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండలంలోని ఇమామ్, మౌజంలకు శనివారం మద్దూరులోని జమా మసీద్‌లో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద ముస్లిం మహిళలకు ఆసరా పింఛన్లు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఇళ్ల మంజూరులో ఇమామ్, మౌజంలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అంతకుముందు మద్దూరులో ఉపాధి నిధులతో వేసిన సీసీ రోడ్లను, అదేవిధంగా హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు సలీం, వీరారెడ్డి, జగదీశ్వర్, షేక్ అహ్మద్, చాంద్‌పాషా, హబీబ్, మహేందర్, ఫీర్ అహ్మద్, ఆయా మసీద్‌ల ఇమామ్, మౌజంలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీకాంత్‌రెడ్డి

ధన్వాడ: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సీఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. తక్షణమే నంబర్ ప్లేట్లు వేసుకోవాలని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు తప్పకుండా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ట్రాక్టర్లతో ఇసుక, మట్టి(మొరం) రవాణా చేసేవారు కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని, లేనిచో చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎస్‌ఐ రమేష్, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపించాలి



నారాయణపేట టౌన్ : కోటకొండలో అంగన్‌వాడీలో ప్రీస్కూల్ మేళా ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణపేట: శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఆర్ఐ అడ్మిన్ డేవిడ్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వీక్లీ పరేడ్‌లో మాట్లాడారు. పరేడ్ వల్ల మంచి క్రమ శిక్షణ, సమయపాలన అలవడుతాయన్నారు. విధులు నిర్వర్తించే సమయంలో తలెత్తే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయుధాలు ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకొని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ క్రిష్ణయ్య, ఎస్ఐలు శ్రీనివాస్‌రావు, శీనయ్య, ఆర్ఎస్ఐలు ఇందిర, శివశంకర్, జిల్లా పోలీస్ స్టేషన్‌లోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి

ఊట్కూరు: విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. ఉపాధ్యాయులు ఆంగ్ల భాష ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. మండలంలోని నాగిరెపల్లి పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం సురేష్, ఆర్‌పీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మక్తల్: లింగంపల్లి ప్రాథమిక పాఠశాలను ఏఎంఓ విద్యాసాగర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను సమయానికి ముందే వదిలిన ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

'సమాజ సేవే లక్ష్యం'



నారాయణపేట టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో సమాజ సేవ చేయడమే లక్ష్యమని డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ్ భట్టడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ గండె కార్తీక్, జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు గండె ఉమాకాంత్‌లు నూతనంగా ఎన్నికైన ఆయనను సన్మానించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం

నర్వ: మండంలోని రాయికోడ్‌లో మహాత్మజ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు మల్లేష్, కందుకూరి అశోక్‌కుమార్‌లు చేయూతనందించారు. రూ. 20 వేలు విరాళం అందించారు. నగదును నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శంకర్, గోపాల్, శ్రీనివాసులు, రవి కుమార్, రామకృష్ణ తదితరులున్నారు.



విరాళం అందిస్తున్న ఉపాధ్యాయులు

అవార్డు పొందడం అభినందనీయం : కలెక్టర్



సర్పంచ్, కార్యదర్శి, ఎంపీడీఓలను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: సుపరిపాలన విభాగంలో మక్తల్ మండలంలోని ఖానాపూర్ గ్రామ పంచాహయతీ రాష్ట్ర స్థాయిలో జాతీయ గ్రామ పంచాయతీ అవార్డు పొండటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ విద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నుంచి ఖానాపూర్ గ్రామ పంచాయతీ సుపరిపాలన సంకల్పంలో రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సంపాదించగా అవార్డు , ప్రశంసా పత్రంతో పాటు మెమొంటో తీసుకున్నారు. శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఖనాపూర్ సర్పంచ్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి రఘుస్వామి, ఎంపీడీఓ శ్రీధర్ గౌరవప్రదంగా కలవడంతో వారిని శాలువాతో సత్కరించారు. వచ్చే ఏడాది జిల్లా నుంచి మరిని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కలెక్టర్‌తో పాటు డీపీఓ మురళీ ఉన్నారు.

చదువు ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది

ధన్వాడ: చదువు ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని జిల్లా సివిల్ జడ్జీ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పిల్లలకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి లియాకత్అలీ, ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, ఎస్ఐ రమేష్, హెచ్‌ఎం రమేష్ శెట్టి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



వద్వాట్‌లో విద్యార్థులతో చదివిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్, పర్మన్‌దొడ్డి ప్రభుత్వ పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సిములు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు పలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒంటి పూట బడులు కావడంతో విద్యార్థులు బావులు, చెరువుల దగ్గరకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని అటువంటి వాటికి వారు దూరంగా ఉండేలా అవగాహన కల్గించాలని సూచించారు.

డంపింగ్ యార్డును తొలగించండి



ఆందోళన చేపట్టిన ఇబ్రహీంపట్నం గ్రామస్తులు

- చెత్త సేకరించే ట్రాక్టర్లను తిప్పి పంపిన గ్రామస్తులు
- వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన

మరికల్: మండల కేంద్రానికి చెందిన డంపింగ్ యార్డులో వేసిన చెత్తకు నిత్యం నిప్పు పెడుతుండడంతో కాలుష్యం పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామనిపక్కనే ఉన్న ఇబ్రహీంపట్నం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆందోళన చేపట్టారు. సర్పంచ్ సుజాత, గ్రామస్తులు రవి, బంగారు శ్రీను, పాపిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. డంపింగ్‌యార్డు ఇబ్రహీంపట్నం గ్రామానికి దగ్గర ఉందన్నారు. అక్కడ వేసే చెత్తను ఎరువుల తయారీకి వాడకుండా, నిప్పు పెడుతున్నారని అన్నారు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా కాలుతున్న ప్లాస్టిక్ కవర్ల వల్ల వచ్చే విషవాయువులు, దుర్వాసనతో గ్రామస్తులు తీవ్రంగా రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. మరికల్ నుంచి వచ్చిన చెత్త సేకరించే ట్రాక్టర్లను తిప్పి పంపించారు. మరికల్ సర్పంచ్ స్పందించి వెంటనే ఇక్కడి నుంచి మరోచోటకు డంపింగ్‌యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. వేణు, శ్రీనివాస్, ఆంజనేయులు, రఘుపతి, బాలచందర్, రంగన్న, నర్సింహ్మ, రామకృష్ణ పాల్గొన్నారు.